"వసంతా!" అన్నాడు నూతిలో గొంతుకలా! నర్సు కళ్ళవెంట రెండు నిర్మలమైన మంచుబిందువుల్లాంటి కన్నీటి బిందువులు చెంపలమీదుగా జారిపోయాయి.

ఆమె వెనుతిరిగి వెళ్ళిపోయింది. నర్సూ, డాక్టరూ గుసగుసలాడి "వసంత ఇహలోక యాత్ర చాలించిం" దన్న కాగితం ముక్కను చింపేశారు.

వాళ్ళ విశ్వాసం...దానితో అతని ఇహలోక యాత్ర పొడిగించామనీ....ఒక ప్రాణదానం చేశామనీను—

* * *

# వాయు

ముసురు పట్టినట్టే వుంది.

బంగాళాఖాతంలో ఎక్కడో వాయుగుండం కాబోలు. అవతల వాన పడుతున్న సంగతి కిటికీలోనుంచి కొంచెం తెలుస్తూనే వుంది.

గడియారం ఐదు కేసి పరిగెడుతోంది. నా వ్రేళ్ళు టైపు రైటర్ మీదున్నా మనసెక్కడో వుంది. దరిద్రుడు తల కడిగితే వడగళ్ళ వాన అన్నట్లు ఈ వానొకటి నా నెత్తిమీదకి.

బాస్ రూమ్‌లో బెల్ మోగింది. "సార్" అంటూ రాములు పోయి ఇట్టే తిరిగొచ్చి "రమ్మంటున్నా" రన్నాడు. నా ఒళ్ళు మండిపోయింది.

మా బాస్ మంచివాడని మొన్నిమధ్యదాకా నాకు నమ్మకం వుండేది. కాని కోపిష్టి అయితేనేం, నాపట్ల మంచివాడు అనేవాణ్ణి. ఒకరిద్దరు క్లార్క్‌లకిది కోపకారణం అయింది కూడాను.

కాని ఆయన ఈ "మాట" దక్కించుకోనేలా లేడు ఇవాళ మా డైరెక్టర్ నా కళ్ళకి ఉత్త ఉడుకుమోతుగా కనపడ్డాడు.

ఎంత సైపిస్టునైతేమాత్రం నాకూ ఓ జీవితం వుంటుందనుకోనక్కర్లా. పోనీ, ఇది ఇరవయ్యో శతాబ్దంకదా కాస్త అలా నటించవచ్చుగా!

కాని ఈ దుఃఖమంతా నా లోపల పూర్తి కాకుండానే నేను మా బాస్ దగ్గరికెళ్ళి డ్రాఫ్ట్ తీసుకుని మరీ వచ్చాను.

ఎప్పుడూ లేనిది ఇవాళ మా బాస్ నేను "యస్సార్" పోజులో ఆయన దగ్గరకు వెళ్ళేసరికి నవ్వుతూ వున్నాడు. ముసిముసిగా ఎర్రని గారపళ్ళు కనపడేలా నవ్వుతున్నాడు. అది నవ్వుకాదు. "వల." యజమానులందరి దగ్గరా ఈ ఆయుధముంటుంది.

"కాస్త యిది అర్జంటు. ఆ డామ్‌ఫూల్ లాయర్ ఆలస్యంగా పంపించాడు డ్రాఫ్ట్" అన్నాడు.

నేను నవ్వుతూ "అలాగే సార్!" అంటూ ఇవతలికి వచ్చాను. ఇవతలికి వచ్చి దుఃఖపడ్డాను.

ఎంత టైపిస్టునీ, చేతిక్రింద వుద్యోగినీ అయితే మాత్రం నాకూ యిరవై నాలుగేళ్ళ వయసూ ఐదడుగుల నాలుగంగుళాల పొడవూ వున్నాయి కదా! కాస్త "సొంత లైఫ్" వుంటుందనుకోనక్కర్లా!

కాని యిప్పుడెన్ననుకోని ఏం లాభం! టైపురైటర్ మీద "బడబడా" బాదుతున్నాడు. ఈ జ్ఞానం మొదటే వుండాల్సింది. గడియారం చూసి పోవడం అలవాటు చేసుకోవాలిసింది. "బాస్ కారు వెళితేకాని వెళ్ళను" అనే మూర్ఖపు పని నేర్చుకోకుండా వుండాల్సింది.

పాతికేళ్ళు వస్తోన్న నా కామాత్రం తెలివితేటలుండాల్సింది.

మాయాదేవిలాంటి ఓ అందమైన అమ్మాయి ఓ శుభ ముహూర్తాన నన్నూ "ఓ అందమైన పురుషుడవు సుమా!" అన్నట్లు చూస్తుంది. ఫలానారోజు మనం అలా వెళ్దామా అంటే "ఊఁ" అనో, "మీ యిష్టం" అనో అంటుంది. అదే జ్ఞానం యిదివరకే వుంటే ఈ అరవచాకిరీ తప్పేది కదా! అవతల వాన తెరిపి యిచ్చింది కాబోలు. జనం, బళ్ళూ అన్నీ త్రోసుకు దూసుకుపోతున్న సందడి వినపడుతోంది.

నేను మాయతో సరిగ్గా ఐదు గంటలకి బ్రాడ్వే థియేటర్ కి వస్తానన్నాను. అక్కడినుంచి ఎక్కడికేనా పారిపోదా

మన్నాను. కాని కర్మ! ఐదూ ఇరవై అయిపోయింది. నేనింకా బానిసచాకిరీ చేస్తున్నాను.

బాస్ 'మొహాన' అది ఎంతట "పారేద్దామా" అని వుంది. ఇంచుమించు అంతపని చేశాను. అవతలికి పరిగెత్తాను. లిఫ్ట్‌కేసి వెళ్ళనేలేదు. మూడంతస్తులు మెట్లు తప్పించి మెట్లు మీాదకి గెంతుతూ దిగేశాను.

"నేనో అమ్మాయికి డేట్ యిచ్చాను సార్!"

"నాకివాళ అప్పాయింట్‌మెంటుందండీ!"

క్రింద పెద్ద వానే కురిసింది. జనం యింటిమొహంపట్టి పోలోమని పోతున్నారు. ఎవరో వెంట తరుముతున్నట్టు పారి పోతున్నారు.

చిత-చితలాడుతున్నాయి రోడ్లు. బురద! కార్లకీ, బస్సు లకీ అదేదో వాటి ప్రజ్ఞలాగే వుంది. "బాఁ బాఁ" మంటూ గొప్ప విసురుగా పోతున్నాయి.

చిరాగ్గా వుంది. పరాగ్గాకూడా వుంది. ఛీ ఛీ! పాడు నగరం! ఓ ఆగస్టూ నవంబరూ అనే తేడా లేదు. వేళా పాళా లేకుండా చెప్పా పెట్టకుండా వచ్చేయడమే!

జడివాన జలజలా....

ప్యాంటు మడత పెట్టుకుంటే...

ఓహో! ఇదివరకింత పట్టింపు వుండేదికాదు. కాని ఇప్పుడు ప్యాంట్ నలిగిపోవడం నాకిష్టంలేదు.

మాయతో పరిచయమయ్యాక నాకు తెలీకుండానే నాలో యిలాంటి నాగరికత పెరుగుతోంది.

చిన్న తుంపర....

మబ్బులమీద ఇంద్రుడి రథం పెద్ద ఆర్భాటంగా ఉరుముతో పోతోంది. క్రింద నాలుగు చక్రాల రథాలమీద జనం పారిపోతున్నారు. ఇళ్ళకి ఉడాయిస్తున్నారు.

లోడ! లోడ! జడి జడిగా వాన!

మాయా వాళ్ళ ఆఫీసు వదిలేలి ఈపాటికి అరగంటేనా అయ్యుంటుంది. బోలెడుమంది ఆడపిల్లలు అందంగా, అందం లేకపోయినా ఒయ్యారంగా ఇలా, అలా పోతున్నారు.

సుజాతలు, సుబ్బులు, మరియమ్మలు, యమునలు, కావేరులు, ఈ స్తర్‌లు ఈనాటి అందరూ వర్కింగ్ లాన్‌లు! ఒయ్యారంగా చీరె కుచ్చెళ్ళను చేతుల్తో ఒకవేపుకి యిలా పైకెత్తి పట్టుకుని చినుకులకీ చినుకులకీ మధ్యనుంచి పోతున్నారు.

నా ప్రక్కనించే బర్రున ఆర్. టి. సి. బస్సు దూసుకు పోయింది. ఎంతపొగరు! చూసుకోరాదూ! డేర్ హవుస్ అంటూ అంతెత్తు భవనం, కాని దానిముందు యిలా చిత చితా బురదనీళ్ళు....

అదీ, నాకర్మ కాకపోతే నామీదే త్రుళ్ళిపడాలీ!

ఒక్క గెంతు వేశాను ఫుట్‌పాత్ మీదకి.

ఇంచుమించు ఓ పెద్దమనిషిమీద పడ్డాను. తప్పు నాదే అనుకోండి! కాని ఆ పెద్దమనిషి మాత్రం మంచివాడా? చూడండి మరి!

చీకట్లు తొందరగా ముసురుకున్నాయి. ముసురు మూసి వాన పడుతోంది. గాలివానో, గగ్గోలువానో వస్తుందని జనం పారిపోతున్నారు. ఇదేమీ పట్టించుకోకుండా తమలపాకులకు తాపీగా సున్నం రాసుకుంటూ త్యాగరాజ కీర్తనొకదానిని అంతకు క్రితమే నోట్లో వేసుకున్న పొగాకుతో నమిలేస్తూ నిశ్చింతగా పోతున్నాడు.

పోడా మరి!

లుంగీపంచె యిలా ఎత్తి అంత పైకి నడుంకి కట్టేసుకున్నాడు.

నేనింకా పూర్తిగా మీద పడకుండానే "సారీ" అన్నాను తప్పుకుంటాడనే ఆశతో.

"ఎన్నాయ్యా! సారీ!" అని కసిరి, చూసుకుని పోవయ్యా అనే అర్థంలో ఇంకా ఏమో అని మళ్ళీ ఆకులకు సున్నం రాసుకుంటూ వెళ్ళిపోయాడు.

నేను లోపల లోపలే తిట్టుకున్నాను.

ఆరోజుకూడా యిలాగే జరిగింది. తొలిసారి నా జీవితంలో మాయ అడుగుపెట్టినరోజుకూడా యిలాగే వుంది వాతావరణం. కాని ఆ తర్వాత ఎంత హాయిగా వుందని! మాయ అంటే మిస్ మాయాదేవి. ఆమెగురించి నేనెంత

చెప్పినా యింకా చాలదనే అనిపిస్తుంది. అంతకన్న ఎక్కువ గ్లామర్ ఆమెలో వున్నదని మీరు చూస్తే అనుకుంటారు.

సరోజాదేవి మెడ మీద వైజయంతీమాల మొహం, మాలాసిన్హా కళ్ళు అతికినట్లుంటుంది మాయ.

ఆ కళ్ళు చాలా పెద్దవి. మనల్ని "వెధవా" అన్నట్లు చూస్తున్నారో, "డార్లింగ్" అంటూ పలకరిస్తున్నారో చెప్పుకోడం కష్టం.

గొప్పగా వుంటాయా అమ్మాయి మాటలు. 'రెమింగ్టన్' మెషిన్‌లా పరిగెడతాయవి.

ఆమె చూస్తే ఆ చూపులో రెండర్థాలుంటాయి, నవ్వితే చాలు! ఆ నవ్వు కైపులో మనల్ని మనం మరచి పోయి ఏ కారుక్రిందో పడిపోడం ఖాయం!

ఆ రోజు ఆగస్టు నెల ముప్పయ్యా? అవును. లేకపోతే నేను ఖాళీ జేబు తడుముకుంటూ నడక సాధన ఎందుకు చేస్తుంటానూ?

తనేమో...ఏమో మరి! ఎలా వస్తుందో, అంతకు ముందు చూస్తేగదా తెలిసేది! కాని, అంగప్ప నాయకన్ వీధిలోనుంచో ఆర్ముగం లేన్‌లోనుంచో వస్తోవుంది. నేనిలా వస్తున్నా.

తను నా వెనకాల రావడం నే గమనించలా. ప్యాంటు కాళ్ళు శుభ్రంగా మోకాళ్ళదాకా మడతపెట్టేశా! చెప్పులు తొడుక్కున్నానో...లేదా కాయితంలో చుట్టి...

మొహం ప్రొద్దున్నించి కారిపోయిన చెమటతో కాస్త ఉప్పుకూడా పేలిపోయింది.

అదృష్టం షారీఫ్ కార్నర్‌లో అలా దారికాసింది మరి. మామూలు సైపిస్టునీ. ఈమధ్య కాస్త లావెక్కిపోయానుట కూడా. అని మా హోటెలువాడు అన్నాడు. కోశాడేమో మరి!

ఆవేళ నేనేమో ఇందాకావెళ్ళిన 'వెత్తలపాక్'భాయీ జాగాలో వున్నానన్నమాట. అతనిమీద నేను చెంగున గెంతి నట్లే ఆమె నామీదకు ఆనాడు గెంతింది.

ఆమె చేతిలో గొడుగుంది.

సన్నని ఆ చేతికి రిస్టువాచీ వుంది.

రెండో చేతిలో జిప్ గల ఎర్రని వానిటీ బ్యాగ్ వుంది.

కుచ్చిళ్ళు జాగ్రత్తగా సాటిన్ లంగా కనపడుతూ వుండగా ఎత్తి పట్టుకుని, వానిటీ బ్యాగ్ చేత్తోనే వాటినీ పట్టుకుని వయ్యారంగా వస్తోన్న మాయ...నామీద....యించుమించు నామీదే పడ్డది. పడాలనుకోలేదు. కాని అలా జరిగింది.

హడిలి చచ్చేనంటే నమ్మండి.

"సారీ" అని నేనే ముందనేసేను.

షాక్ తగిలినట్లు ఝల్లుమంది నాకు.

అలాగే అయింది. షాక్ కొడితే ఎలా వుంటుంది? ఝల్లుమంటుంది. మనం చచ్చిపోకుండా బ్రతికే వుంటాం! ఆహా! అదో గొప్ప అనుభూతి కదూ!

"నో...నెవర్ మైండ్!" అన్నది. ఆమె నా సారీకి బదులుగా క్షమించాను ఫో అన్నట్లు పయిట సర్దుకుంటూ గొడుగుమీద ఆసరాగా నేలమీద పడిపోకుండా తన్ను తను ఆదుకున్న మాయాదేవి!

చెప్పాను కదూ! పీలగా, సన్నగా, నాజూగ్గా వుండే రకం కాదు మాయాదేవి. కండపుష్టి దండపుష్టి గల అమ్మాయే!

వానపడ్డ రోడ్డు చిత-చిత జారుతున్నదేమో మాయా దేవి కట్టుకున్నది పయిటంచుమీదనుంచి యింకా లేబిల్ కూడా చింపని కొత్త నైలాన్ చీరె. రంగు ముదురు పసుపు పచ్చ. అందులో వున్న తన నూటపాతికా లేక నూటముప్పై ఏ పౌనుల బరువునంతా నేలపాలు చేయకుండా ఆ గొడుగు మీదనే అనుకున్నది.

కాని వచ్చిన యిబ్బందంతా నాకే. అందమైన పడుచు పిల్ల అలా మీద పడిపోతున్నదే అన్న భయంతో మోకాళ్ళు ఒంచి అప్రయత్నంగానే వంగున్న నాకు సరిగా డొక్కలో మాయాదేవి గొడుగు వచ్చి గుచ్చుకుని వుంది. అంతే!

దానిమీదనే ఆ లతాంగి తన చీరెకు బురద కాకుండా, తాను క్రింద పడగా జనం ఆ దృశ్యం విరగబడి చూడకుండా

తనను తాను కాపాడుకుంది. మీకీ అవస్థ యిప్పటికీ అర్థం గాకపోతే యిక స్వానుభవంలో తప్ప అర్థం అవదులేండి!

చివరికి ఆవిడ తన గొడుగు తీసుకున్న తర్వాత నిటారుగా నా ఐదడుగుల నాలుగంగుళాల ఎత్తూ నిలబడి డొక్కలో తడుముకుంటున్నట్లు తెలియకుండా తడుముకుని "వ్రూఁ" అన్నాను.

ఏ భాషలో తిడుతుందా? అని ఆలోచిస్తున్నాను. వేషం మర్యాదగానే వుంది. చూద్దాంలే అని తిట్టు తినడానికే సిద్ధపడ్డాను.

"పాపం" అన్నది ఎర్రని చిన్న పెదాలు కదిపి. 'పావం' అని వుంటే ఏ బాధా లేకపోను. కాని తెనుగులోనే జాలిపడ్డది మాయాదేవి. (అప్పటికా పేరు నాకు తెలియదు)

ఎక్కడలేని కోపమూ ఒక్కసారి వచ్చింది నాకు.

"నీ మొహం! గుర్రమంత ఆడపిల్లవి, నా డొక్కలో చచ్చేలా గొడుగుతో పొడిచేసి యింకా పాపం అంటావేమిటి?" అందా మనుకున్నాను. కాని పెదాలు విడితే ఒట్టు!

"మరేం ఫర్వాలేదులెండి! మీకేం దెబ్బ తగల్లేదు కదా?" అన్నాను నాలిక తడుపుకుంటూ, డొక్కలో పోటు డొక్కలోనే అదుముకుని.

అలా అయింది మా పరిచయం!

అబ్బ! ఇంకా నాలుగు సందులు దాటాలి. హైకోర్టు నెత్తిమీద లైట్ హవుస్ వెలిగింది. తిరుగుతోంది

అయ్యయ్యో! మాయా అక్కడ వానలో (ముసురే అను కోండి. వాన ఇంకా తెరిపి తీయడంలేదు) ఎంతసేపైంగో నుంచోని ఎదురు చూస్తో! ఏమనుకుంటుందో. తిడుతోంది కాబోలు. పైగా ఎక్కడికి వెళ్దామంటుందో....

సరిగ్గా జ్ఞాపకం వచ్చింది. జేబులో చూసుకున్నాను. పర్సు లేదు నాకు. నాలుగే కాయితాలు చేతికి తగిలాయి. అందులో ఒకటే రెండు రూపాయల కాయితం. మిగతావి రూపాయి కాయితాలే! నాకు క్రుంగిపోతున్నట్లనిపించింది. ఈ డబ్బులేం సరిపోతాయి!

నాలో ఉత్సాహం చస్తోంది.

ఎంత హాయిగా వుంది. ఆవేళకూడా ఇలాగే వున్నది. బరువైన మేఘాలున్నాయి ఆకాశంమీద. దీపాలు వెలిగే సరికి ఈ రోడ్లన్నీ ఆవేళ ఎంత బాగున్నాయని. ఇవాళకూడా అలాగే వాన. అదే వాతావరణం. మాయకు వస్తానని చెప్పాను. "ఎక్కడికైనా పారిపోదాం" అన్నాను.

"కాని ఎక్కడికి పారిపోతాం? అన్నీ కలిపి ఐదొందలు పైసల్లేని టైపిస్ట్ రమణా! ఎక్కడికి పోతావ్?"

కారుక్రింద పడిపోతే....ఆస్పత్రిలో పడేస్తారు. మాయకు ఈ సంగతి ఎలాగో అలా తెలుస్తుంది. తను వస్తుంది. "సారీ" అంటుంది. ఇప్పుడీ "అప్పాయింట్‌మెంట్" ఎలా తప్పించు కోవడం మరి?

సినిమాకి వెళ్ళాలంటే? పోయిన శనివారంలాగ, మెరీనాకి వెళ్ళి పీచ్‌మల్బా తినాలంటే? వాన మొత్తేస్తోంది... తడిస్తే జలుబు చేస్తుంది. మనం టాక్సీలో పోదాం రాంషి అంటే...

ఏమన్నాసరే! నాదగ్గిర తంతే మరోపైసా లేదు. జనం అటూ ఇటూ ప్రవాహంలో కొట్టుకుపోతున్నారు. ఒక్క తెలిసిన మొహం లేదు. అప్పైనా యిర్చైనాధుడుంటే బాగుణ్ణు కావాలంటే వడ్డీ ఇస్తాను.

అంతలో రానే వచ్చింది బ్రాడ్వే అనే సందు. అందులో బ్రాడ్వే అనే థియేటర్.

“ఆహా! మాయ! ఎంతసేపయిందో నాకోసం ఎదురు చూస్తో వుండి” పరిగెడదామనుకున్నాను జనం చూస్తే నవ్వుతారని భయంవేసింది.

అప్సరసలా వుంది. అదేమిటోమాదిరిగా జుత్తునంతా పైకితీసి అలా అలా మీదకు కట్టుకుంది. అజంతా శిల్పం లాగో, షర్మిలాటాగోర్‌లాగో నాకే తెలియదు. పొడుగ్గా వున్న మెడమీద గుండ్రని మొహంమీద నల్లగా, కోలగా, ఎత్తుగా ఆ ముడి గుడిగోపురంలా వుంది.

నేనింత ఆలస్యాం చేశానని కాబోలు కొంచెం మొహాన చిరాకు కనపడుతోంది. మాయను చూస్తే ఇవాళ ఏదో పెద్ద ప్లానుమీదే వున్నట్లుంది. కొత్తచీరె కట్టుకుంది. ఒక చేతిలో

చిన్న గొడుగుకూడా వుంది. మూడు ముస్తాబులూ అయి వచ్చింది. వాళ్ళాఫీసుకు శెలవు యిచ్చేశారు కాబోలు!

నన్ను చూస్తూనే కోపంగా నవ్వేసింది. "సారీ! లేటయిందా" న్నాను బుద్ధిగా ప్రక్కగా వెళ్ళి నిలబడి. "నిన్ను పోల్చలేనంత బాగున్నావ్" అన్నాను. "ఈ బస్టాప్‌లో నిలబడ్డ ఫాషన్ మోడల్ అనుకున్నావా?" అంది గోముగా, చిరాగ్గా.

కారణం చెప్పాను. అందులో సగం అబద్దాలే చెప్పాను. ఒట్టు! అంతవరకూ నే చెప్పిన అబద్ధాల్లో ఏ ఒక్కటీ నే నదివరకు వూహించినవి కావు. అప్పటికప్పుడు అలా వచ్చేశాయంతే!

ఒక బస్ వచ్చింది.

"వెళదామా?" అన్నాను. అబ్బబ్బ! మాయ ఎంత ఇదిగా వుంది. తాజాగా తయారై వచ్చింది. నాకే సిగ్గేస్తోంది. ఏదోలా వుంది.

"వానలో బురదలో బస్సేం ఖర్మ!" నీ బ్రతుక్కిం తేనా అన్నట్లు చూసింది అంతలో మాయ.

"కూ(ప)మ్ రివర్‌లోకా?" అంది.

చెప్పానుగా! తన ధోరణిలో నవ్వింది. దానర్థం "వెధవా" అనేనా కావచ్చు, "డార్లింగ్" అనేనా కావచ్చు.

"కాదూ! మరెక్కడికీ?" అంటూ జేబులో ఐదు రూపాయల విలువైన నాలుగు కాయితాలను ఒక చేత్తో భద్రంగా జేబులోనే పట్టుకుని అడిగాను.

బస్సు వెళ్ళిపోయింది.

"ఇంచక్కా సినిమాకి పోదామనుకున్నాను" తన చిన్ని గడియారాన్ని యిలా చూసుకుంటూ అన్నది.

"బాగుంటుంది కాని, ఏం చూస్తాం పాడు సినిమాలు! వెధవది బోలెడు రష్షూ, రద్దీ" విరక్తి ప్రకటించాను. నీళ్ళు నములుతాన్నట్లు మాటలు వస్తున్నాయి నాకు.

"మరెక్కడికి పోదాం?"

"ఎగ్జిబిషన్ వుందిగా" బ్రహ్మాండమైన నా ఐడియాకి నేనే మురిసిపోయాను.

"జూ'కి ఎందుకు పోకూడదూ?"

"పోవచ్చును కాని యిప్పుడుండదు" అన్నాను సిన్సియర్‌గా. వెటకారం చేస్తొందని తెలియదు నాకు.

మాయ గొణుక్కుంది. విసుక్కుంది. నేను బొత్తిగా రొమాన్స్ తెలీని ఘటంలా క్రుంగిపోయాను.

జేబులోని రూపాయినోట్లు పిల్లలుపెడితే ఎంత బాగుండును?

"అహా...అదిగాదు మాయా! మనం ఎగ్జిబిషన్‌లో అయితే ఈ చల్లని వాతావరణంలో ఇంచక్కా..."

"ఊ...ఇంచక్కా..." వెక్కిరించింది. వెక్కిరించినా బాగానే వుంది మాయ.

ఏం చెయ్యాలి? షాపింగ్ చేస్తానంటుందా ఏం? కొంప దీసి...చస్తాం. సినిమాకే గతిలేదు. నేను షాపింగ్ ఏం చేయి

స్తాను! అదీగాక మాయకు అన్నీ వున్నాయి ఒక్క రిబ్బన్ తప్ప. ఇంకేం అనుకొంటుందిలే అనుకొని....అంతగా అయితే అది కొని యివ్వొచ్చును అనుకున్నాను. కాని అలా అని బయటికి చెప్పలేదు.

"హాయిగా ఎక్స్‌ప్రెస్సో కాఫీ త్రాగుదాం" అన్నాను గొప్పగా.

పెద్ద పెద్ద కళ్ళు మాయవి. చింతగింజల్లా ముడుచుకు పోయాయి.

"నీకు మేనత్తకూతుళ్ళు, మేనమామ కుమార్తెలూ లేరా!" అడిగింది కసిగా.

ఉన్నారనాలా? లేరనాలా? ఇంతకీ మేనత్తలు, మేనమామలూ లేని నాకు వాళ్ళెలా వస్తారు. అందుకనే "లేరే" అన్నాను.

ఈలోగా ఒకటాక్సీ పలకరిస్తూ వెళ్ళిపోయింది. (అంటే హారన్ వేసి పోయిందన్నమాట)

"మరి ఈ జంతుశాలకీ, ఎగ్జిబిషన్‌కి తీసికెళ్ళడం.... అదుగో ఏనుగు, యిదుగో సముద్రం అని చూపెట్టే అలవా టెక్కడయిందీ? అదేం సరదా బాబూ?" అన్నది నవ్వుతూ.

ఎక్కడైందీ? ఎక్కడా అవలేదు. ఆ మాటకొస్తే మాయతో పరిచయం లేనప్పుడు నేను ఇలాంటి సమయాల్లో సినీమాకే వెళ్ళేవాణ్ణి. ముఖ్యంగా శివాజీ, సరోజాదేవి అంటే

నాకు ఇష్టం. కాని అప్పుడా సినిమా అంతా కలిపి రెండు రూపాయలే అయేది.

“సరే! ఇప్పుడూ టైమై పోయిందిగా! ఈ థియేటర్‌లో....” అని మొదలెట్టాను.

నా మాటలకు మాయ ఎర్రనిపెదాలు, అందమైన కనుబొమలు, చక్కని శరీరం కోపంతో కదులుతున్నాయి. నేను గమనించాను.

మా వూళ్ళో చుట్టలు కాల్చేవాళ్ళుకూడా ఈ థియేటర్‌కి రారు. ఇదేం సినిమా ఇక్కడాడుతున్నదీ? సెన్త్ రన్ పిక్చర్ సార్!” అంది. వాళ్ళ వూరు కర్నూలు కాబోలు. చెప్పిందిగాని మరిచిపోయాను.

“చీకట్లో కూడాని ఇటువాళ్ళు అటువాళ్లూ వినుకుంటారేమోననే భయంతో మాట్లాడకుండా చిత్రం చూసి; ఆనక లైట్లు వెలగగానే హడావుడిగా గుడ్‌నైట్ అంటూ బస్సులకోసం పరిగెట్టడమేగా సినిమా.”

నేనుకూడా ఘాటుగా మాట్లాడాను. “హాయిగా కబుర్లు చెప్పుకుంటే బాగుండదూ?” అన్నాను.

“థాంక్స్! వస్తా...నువ్వు ఇలాగే ఈ బస్సు షెల్టర్‌లోనే తెల్లార్లూ నిలబెట్టేలా వున్నావ్” అంది మాయ. మాయ ముక్కు ఎర్రగా వుంది. బాగా కోపం వస్తే అలా అవుతుంది.

కణతలు నొక్కుకుంది.

"ముందు కాఫీ త్రాగుదాం పద" అన్నాను. నాకు తెలుసు మాయకు ఏర్ కండిషన్డ్ థియేటర్లో రిజర్వ్డ్ క్లాసు కూడా టిక్కెట్లు దొరకని ఎమ్.జీయార్ బొమ్మంటే ఇష్టం. కాని అది ఇప్పుడు నా తరమా?

"ఎక్కడ? బడ్డీదుకాణంలోనా కాఫీ త్రాగుతాం?" అడిగింది మాయ. (ఎంత వేళాకోళం!)

"ఊహూ...ఎగ్జిబిషన్‌లో 'ఇండ్యా కాఫీ బార్'లో".

పచ్చ చీరా, అదే రంగు సిల్కు బ్లవుజూ వేసుకున్న మాయ "సరే, ఆతిరణాలకే పోదాంపద" అన్నది అయిష్టంగా ఎట్టకేలకు.

నాకు బస్సులో వెళ్ళాలనే ఉంది. కాని ఆ మాట అనడానికి ధైర్యం చాల్లేదు.

'బాబీ' సినిమాకి వెళ్ళాలనుకున్నాను. నువ్వేమో వేళ చూసుకుని దాని ఇంటర్‌వెల్ అయిపోయాక వచ్చావ్" అంది.

నేను నసిగాను. "నాకు తెలియదుగా" అన్నాను. ఈసారి అడ్వాన్స్ బుకింగ్ తీసుకుని వెళదామన్నాను.

"అసలు హాయిగా బీచ్‌కే వెళ్దాం. కాని ఈ పాడు క్లయిమేట్ ... ఇప్పుడేగా వాన వెలిసింది" అన్నాను. "పీచ్‌మర్బా తినాలనుంది నాకు" అన్నాను. ఇంకా ఎన్నో యిలా అన్నాను. నిజంగా నాకు అలాంటి కోర్కెల్లేవు. ఉన్నా నా తాహతుకి ఇప్పుడది ఎక్కువే. నాకున్న

కోర్కె ప్రస్తుతం ఒక్కటే! ఈ అయిదు రూపాయల్తో మాయ దగ్గర పరువు దక్కించుకుని బయట పడటం!

పైగా ఆకలిగా వుంది. ఏదైనా యింత వేడిగా వేరు శనక్కాయలైనా, మిరపకాయ పకోడీలైనా తింటే బాగుండును.

మాయకున్నూడా అలాగే ఉందేమో.

"దవడలు చలికి సలుపుతున్నాయి. పీచ్ మల్బా, అయిస్‌క్రీం, అయిస్‌ఫ్రూట్ ఇంతేనా? ఏంబిషన్సు!" నవ్వింది మాయ.

చివరికి నేనూ మాయూ రాజీపడ్డాం.

టాక్సీలో కూచున్నాం. నా గుండెలు పీచు పీచు మంటున్నాయి, ఇంత అందమైన మాయ ఇలా ఈ చల్లని వాతావరణంలో వెచ్చగా నా ప్రక్కని కూచున్నప్పుడు. మరోకసారైతేనా? ఎవగిలా వుండేవాణ్ణి? "రాజా"లా, "నవాబ్"లా, "స్టార్"లా, "లక్షాధికారి"లా ఉహూ... బ్రహ్మాండంగా ఉండేవాణ్ణి.

టాక్సీ మవుంట్ రోడ్ మీాదకు మెల్లగా సాయంకాలం ట్రాఫిక్ గుండా ప్రాకుతున్నది. అవతల తుంపర పడుతున్నది. మళ్ళీ ఆగిపోతున్నది. నాకు ఆ వానలో పరిగెత్తాలనుంది. ఆ మాటే అన్నాను.

మాయ నవ్వింది. నా చెయ్యి తన చేతిలోకి తీసుకుంది.

"నీ కోర్కెలన్నీ బి. సీ. వి. రూపాయలు ఈ దేశంలో పుట్టక పూర్వానివి రమణా!" అంది. అందులోని దెప్పిపొడుపును గ్రహించే స్థితిలో లేను నేను.

"నాకు ఎన్నాళ్ళుగానో వుంది ఓ కోర్కె" అన్నాను.

మాయ శిరోజాలంకరణ నాకు నచ్చలేదు. కాని కప్పుని పొడిన వేస్తోందామె జుట్టు.

మాయ కిలకిలా నవ్వుతూ "ఏమిటో అది...బస్సులో మైలాపూర్ వెళ్ళి అక్కడ గుళ్ళో కొబ్బరికాయలు కొట్టి... ప్రక్క కిళ్ళీ కొట్లో "లవుజు" బిళ్ళలు కొనుక్కొని ప్రసాదంలో కలిపి తినడమా?" అన్నది.

గొప్పగా నవ్వుతోంది మాయ. టాక్సీవాడు కూడా ఇక కేవలం రోడ్డుమీదే తన దృష్టి కేంద్రీకరించడం తెలివి తక్కువ అనుకున్నాడు.

నాకు కొబ్బరికాయ ముక్కలు యిష్టం అని మాయ నోట విని నేను "స్టన్న"యిపోయాను.

ఈ సంగతి మాయకెలా తెల్సు? మాయ అసాధ్యురాలు! నా గుట్టు, పరువు అన్నీ యిలా ఈ రోడ్డుమీద...

"కాదు" అన్నాను కర్కశంగా, కోపంగా. "నాకు జెయింట్ వీల్ ఎక్కాలనుంది" అన్నాను.

"నాకు "ఓ లాలిప్లా కొనుక్కోవాలనుంది" అన్నది మాయ.

"అదేమిటీ?" నేను నిజంగా తెల్ల మొహం వేశాను.

"అదే...పూలుతో చేస్తారూ...స్వెటర్ అంటారూ" నన్ను రెండు భుజాలమీద చేతులువేసి కొంచెం వెనక్కి త్రోసి నవ్వుతో వేళాకోళంగా వివరించింది మాయ.

నా గుండెలు జారిపోయాయి.

"ఎగ్జిబిషన్‌లో జైంట్ వీల్ మాత్రం వుంటుంది" అన్నాను.

"రంగులరాట్నంకూడా ఉంటుంది" కొంచెం నిరుత్సాహంగానే అన్నది మాయ.

టాక్సీ మీటర్ రూపాయలు దాటిపోతోంది. నా 'నాడి' వేగంకూడా పరిగెడుతోంది.

* * *

నియాన్ లైట్లు, ఫ్లడ్‌లైట్లు, లౌడ్‌స్పీకరు, కార్లు, కార్ల హారన్‌లు...మామూలుకన్నా తక్కువగానే అయినా కోలాహలంగా ఉంది ఎగ్జిబిషన్ ఆవరణ.

మాయ వానిటీబాగ్‌లో ఎంత ఉందో నాకు తెలియదు కాని రెండు టిక్కెట్లు కొన్నాక నాదగ్గర ఇక ఉన్నది రూపాయిమీద కాస్త చిల్లర. అంతే!

మొదట కుడిప్రక్క కాఫీదుకాణాలు, ఫ్రూట్ జ్యూస్ షాపులూ ఉన్నాయి. ఎడంప్రక్క పద్మాలుగు, సారీ, పద్దెనిమిదీ...ఎన్నో కొన్ని అన్ని రాష్ట్రాల చేనేత దుకాణాలూ ఉన్నాయి. ఒకదగ్గర పీచుమిఠాయి స్టాల్‌కూడా ఉంది.

దూరంగా, అద్భుతంగా నియాన్ లైట్లతో నిలువుగా పసుపూ లేస్తూ రంగ్ రంగ్ మంటూ మేఘాలతో నిండిన ఆకాశాన్ని వింతగా మసగ్గా వెలిగిస్తూ "జైంట్ వీల్" తిరిగి పోతోంది.

చిన్నప్పుడు మా ఊళ్లో అంటే తణుకులో ఓసారి తిర నాలకి నేను రంగులరాట్నంమీదనుంచి పడ్డాను. వారంరోజులు జ్వరం కాసిందట.

ఇప్పుడు ఈ రూపాయిన్నర చిల్లర డబ్బుల్తో మరి చేసేదేముంది గనుక!

నేనూ మాయా కలిసి ఆ జైంట్ వీల్ ఎక్కుదామను కున్నాను. అక్కణ్ణుంచి నేను పడిపోదామనికూడా అను కున్నాను. (దుఃఖం వస్తున్నది మరి)

"చూడు మాయా!" అన్నాను. కాఫీ బార్‌లో కాఫీ తాగుతున్నప్పుడు దానికేసి వేలు చూపెట్టి చూస్తూ.

మాయకి అదొక్కటి తప్ప మొత్తం ఎగ్జిబిషన్ అంతా కావాలల్లే వుంది. ఉల్లాసంగా చూస్తోంది. అక్కడన్నీ అమ్ము తున్నారు దుర్మార్గులు! నా మాయకన్నీ కావాలి కాబోలు! (నేనూ, పీచుమిఠాయి, జైంట్ వీలూ తప్ప)

చెప్పులు, నగలు, చీరెలు, బొమ్మలు, గాజులు, తట్టలు, బుట్టలు అంటే వానిటీ బాగ్‌లు సహా సమస్తం అమ్మేస్తు న్నారు. మాయ ఆ ఎగ్జిబిషన్ కాంతుల్లో మెరిసిపోతోంది. మాయలో ఆ కాంతులు ప్రతిఫలిస్తున్నాయి.

నాకు భయంగా వుంది. ఇక ఇప్పుడు మరో కప్పు కాఫీ త్రాగాలన్నా నాదగ్గర ధైర్యం లేదు.

నాకు ఒక్కటే రక్షణ వుంది.

అదే ఆ రాక్షసి రంగులరాట్నం. నిలువుగా పైకి లేస్తూ క్రిందికి దిగుతూ ఎవడో మాయాసురుడు త్రిప్పుతున్న చక్రమతాబాలా, “ఉప్పుల పొట్లాంలా” తిరుగుతోంది.

నేలమీద అక్కడక్కడ బాగా బురదగా వుంది. మాయ అది చూసి విసుక్కుంది.

“జైంట్ వీల్ నువ్వు ఎప్పుడేనా యెక్కావా?” కాఫీ త్రాగడం అయ్యాకా బయటికి వచ్చాకా అడిగాను.

ఒకవేపు డాక్యుమెంటరీలు ఏవో చూపెడుతున్నారు. రెండోవేపు గవర్నమెంట్ వాళ్ళవే ప్రణాళికల స్టాల్స్ యించుమించు నిర్మానుష్యంగా ఉన్నాయి. మూడోవేపు దూరంగా ఎడ్వర్టయిజ్ మెంట్ స్లయిడ్స్ తెరమీద వేస్తున్నారు.

మాయ జైంట్ వీల్ ఊసెత్తలేదు. కాసేపు సోపులూ, పౌడర్లు, రబ్బర్ పిల్లోలు అవీ ప్రకటనలు చూశాం.

మధ్య మధ్య నేను నిలువుగా తిరిగే ఆ రంగుల రాట్నాన్నే చూస్తున్నాను. దాని 13 ఉయ్యాలలమీద యిద్దరేసి చొప్పున కూచున్నారు. వాళ్ళు హాయిగా పైకి లేస్తున్నారు కెరటాల అంచున కూచున్నట్టు! ఆకాశంమీంచి మహానగరం అన్నీ చూస్తున్నారు. దిగుతున్నారు. కేరుతున్నారు.

అమ్మో అంటున్నారు. భయపడుతున్నారు. అరవై పైసల్లో నాకూ మాయకూకూడా అద్భుతమైన ఆ థ్రిల్ లభ్యమవుతుంది.

అరుదైన థ్రిల్ అది!

మాయ అంటోంది. "వెధవది! హంబగ్ అది. ఫలానా లిప్‌స్టిక్ జెల్‌గా అయిపోతుంది. ఉత్త అడ్వర్టయిజుమెంటే" నన్ను తట్టి మరీ చెపుతోంది.

"ఫలానీ స్నో కొత్తది. అదో ఆ బొమ్మ ఉన్నది అదే బాగుంది." ఇలాగే చెప్పుకుపోతూంది.

కొత్తరకం వస్తువులమీద మోజు! నా జేబులో చెయ్యిపెట్టి చూసి మరీ మాయ యివి లైక్ చెయ్యగలదా! ఏమో "నీ బ్రతుకింతేనా?" అని పారిపోతే...

నాతరంగాదు. కావాలంటే కూ(వ)మ్ నదిలో పడి ముక్కు మూసుకుని చస్తానుగాని మాయ దగ్గర నా దరిద్ర నారాయణ మొహం బయట పెట్టలేను...

మాయ వూలు స్వెటర్లవేపూ, టెర్లిన్ దుకాణాల కేసీ, చెప్పులు, గాజులూమాత్రమేనా; అవి ధరించినవాళ్ళ వేపుకూడా చూసి తనను తాను వాళ్ళతో బేరీజు వేసుకుంటుంది. వీళ్ళలో చాలామందికన్నా తనే "మిన్న"గా వుంది.

చివరికి జైంట్ వీల్ దగ్గరకు వచ్చాం. హాయ్! హాయ్! నాకు ప్రాణాలు లేచివచ్చాయి!

"ఛీ" అంది మాయ.

"బాగుంటుంది మాయా! భయమా?" అన్నాను ఉడికించుతున్నట్లు మొహం పెట్టి.

"మా కోలీగ్ సినిమాకి రమ్మంటే రానన్నాను" అంది మాయ నిందవేస్తూ. "పోవాల్సింది" అంది బాధగా.

ఎవరా కోలీగ్? (ఆడా? మగా?) అనే ధైర్యం నాకు లేదు. మరోసారెప్పుడేనా అడగాల్సిందే!

ముంతకింద పప్పూ, మామిడికాయ బద్దలూ, వేరుశెనక్కాయలూ, తిరణాల సరదా. మంచంమిఠాయి ఏవన్నీ నిన్ను వదల్లేదా! సిటీలో నాలుగేళ్ళయి వుంటున్నారుగా రమణ్!"

ఇక తిట్టడమేనన్నమాట! అరంభమైంది. ఆగదు.

నేనన్నాను. "చూడు మాయా! ఎవరేనా తెలుగు వాళ్ళు వింటే ఏమనుకుంటారు? కాస్త మెల్లిగా...రేపు...."

"నన్నా? ఏమనుకుంటారు? ఇడియట్ ననుకుంటారు. నేనా జైంట్ వీల్ ఎక్కను. నా శారీ క్లాస్ అయింది. చిరిగినా, మాసినా నీ సొమ్మేం పోయింది?" మాయ అటు తిరిగి పోయింది. నాకు ఎవరో హృదయంలో కొట్టినట్లయింది.

నాలో ఓపిక పోయింది. నన్ను, నా నెలాఖరి దరిద్రాన్ని మాయ అవమానం చేసింది. కాని మాయ చాలా అందమైనది. నవనాగరికమైనది. నాకన్నా బహుశా ఎక్కువే చదువుకుందేమో!

"యూరోపియన్ కన్సర్న్" లో రిసెప్షనిస్టుగా ఉంటోంది. నేను ఎలా వదులుకోను? ఎలా ఎదిరించను? ఎలా వాదించను?

తెనుగువాళ్ళు మాయా!" అన్నాను. ఎవరో యిద్ద రమ్మాయిల్ని చూసి భయంగా.

"లెట్ దెమ్ హేంగ్! ఐ గెట్ రోన్!" మాయ విసుసుగా జరిగింది.

"గా! టికెట్లు కొంటున్నా" నేను నడిగాను.

జైంట్ విల్ అద్భుతంగా ఆగింది. గంట కొడుతున్నాడు వాడు. మళ్ళీ మరో బ్యాచ్ టికెట్లు కొనుక్కుంటున్నారు. నేను యింకా ముందుకు నడిచాను.

మాయి హైహీల్డ్ జోళ్ళు వేసుకున్నది. గట్టిగా గబగబా అడుగులు వేస్తూ వచ్చింది. నా మొహంలోకి చూసింది.

"డామిట్! ఐ డోంట్ వాంట్ టికెట్!" అంది.

"తెనుగులో అను. నీ పుణ్యం ఉంటుంది. కొనేశాను టికెట్లు" అని నేను తన చెయ్యి పట్టుకొని మా దగ్గరగా ఆగిన జైంటు వీల్ తొట్టెలోకి ఎక్కుదాం రమ్మన్నాను. జాలిగా, జేలగా వుంది నా ధోరణి.

'శ్రీఘం పోవటం' లాంటి మాటలేవో వినపడుతున్నాయి. మరో జంట ఎక్కేశారందులో. నాకు తలతీస్తున్నట్లుంది.

ఆ జంటలోని అమ్మాయికి భయంగా వుంది. 'అమ్మో' అంటూంది. కాని భర్త వీల్లేదన్నాడు. "పర్వా యిల్లే" అన్నాడు. అంతే! ఎక్కేసింది ఉత్తమ యిల్లాలు!

నా ఒళ్ళు మండిపోయింది.

ఇంతలో చిన్న చినుకులు పడ్డాయి.

జైంటు వీల్ గంట గణగణా మ్రోగుతోంది.

"రా, మాయా! ప్లీజ్!"

ఆఖరి తొట్టె వచ్చింది. ఎక్కాలి. ఇంక లాభం లేదు. వెనకాతల ఇంకా జనం వున్నారు. ఎక్కేశాను.

"రా" అన్నాను ప్రాధేయంగా, జాలిగా దానిమీద నుంచి కళ్లు తీయలేక.

"ఓ" అంది మాయ. ఒక కాలు మెత్తి తొట్టెలో వేయబోయినది. అంతలోనే అహంకారంతో వెనక్కి వెళ్ళి పోయింది.

జైంటు వీల్ తిరగసాగింది.

కళ్లు తేద్దామనుకున్నాను ఎవరో మిగతా తొట్టెల్లో వాళ్ళు నవ్వుతున్నారు. కేరుతున్నారు. (నన్ను చూశా?)

మాయ ఉక్రోషంగా, కోపంగా దెబ్బతిన్న నాగులా వెళ్ళిపోతోంది.

పైన మేఘాలు చీకట్లలో వెల్తుర్లు కక్కుతున్నాయి. నగరం దీపాల శోభతో మరో ఆకాశంలా నక్షత్రాలున్నట్లు వెలుగుచుక్కలు పర్చుకుని వుంది. కళ్ళు తిరుగుతున్నాయి. మళ్ళీ ఒళ్ళు జోగుతోంది.

జైంటు వీల్ తిరుగుతోనే ఉంది. వేగం పుంజుకుంది. కళ్ళు యింకా యింకా తిరుగుతున్నాయి. పైకి లేస్తున్నప్పుడు నగరం, క్రిందికి దిగుతున్నప్పుడు ఆకాశం...దూరంగా దగ్గిరగా

మాయగా వుంది. అంతా....నాకింకా మాయ ముదురాకు పచ్చని చీరతో మాయ!...కనపడుతున్నట్లే వుంది!

నేను జేబులో చెయ్యి తీసేశాను. ఇక ఈ నాలుగు డబ్బులూ రాలితేనేం. నడిచిపోగలను...లేదా తెల్లార్లూ యిలాగే ఈ జైంట్ వీల్‌లో...నాకు వెలితిగా వుంది. అంతా అసహ్యంగా...అదోలా ఉంది.

తిరుగుతున్న జైంట్ వీల్ మీాదనుంచి చూసిన మాయ ఎటు కేసి వెళ్ళిపోయిందోకూడా నాకు యిప్పుడు అంతుపట్టడం లేదు.

మాయ వుంటే నిజంగా ఎంత థ్రిల్ ఉండేదిప్పుడు!

జైంట్‌వీల్ ఆగింది కాబోలు. వాడు దిగమన్నదాకా నాకు తెలివే రాలేదు.

మళ్ళీ వాన అసహ్యంగా కురుస్తోంది. చిరాగ్గా వుంది. మాయ వెళ్ళిపోయింది. ఇక బస్ దగ్గరికి వెళ్ళాలి. క్యూలో నిలబడ్డాను. కాళ్ళు పీకుతున్నాయి. బస్సు రాదు.

“మాయా! మాయా! నువ్వుంటే హాయిగా నడిచేనా పోదుంగా!”

“పాడు ప్రపంచం! పాడు జీవితం! పాడు వాహనాలు! పాడు క్లయిమేట్! ఛీ! ఛీ! అంతా మాయ!”

* * *